మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 116/ 17 శుక్రవారం, నవంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

## కాంగ్రెస్ గూటికి చేరిన రాములమ్మ

### ఖర్గే సమక్షంలో పార్టీలో చేరిక

### కండువా కప్పి ఆహ్వానించిన కాంగ్రెస్ అధ్యక్షుడు

**హైదరాబాద్,నవంబర్17 (మరో ఉదయం న్యూస్):**

మాజీ ఎంపీ విజయశాంతి తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. గాంధీభవన్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో విజయశాంతి కాంగ్రెస్‌లో చేరారు. రాములమ్మకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీ సీటు హామీతో విజయశాంతి హస్తం పార్టీలో చేరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలే బీజేపీకి రాజీనామా చేసిన ఆమె గత కొంత కాలంగా కమలం పార్టీలో ఆమె అంటీముట్టనట్టుగా వ్యవహరించారు. అసంతృప్తి నేతలతో రహస్య సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంటకస్వామి కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. అదే సమయంలో రాములమ్మ కూడా చెయ్యి పార్టీలోకి వెళ్లిపోతారని ప్రచారం నడిచింది. మొత్తం మీద ఎంపీ సీటు హామీ మేరకు కాంగ్రెస్‌లో చేరినట్లు సమాచారం. గతంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు విజయశాంతి స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికల ప్రచారం పీక్ స్టేజ్‌లో నడుస్తోంది. ప్రధాన పార్టీలతో పాటు ఆయా పార్టీలు క్యాంపెయిన్ ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలో విజయశాంతికి కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యతలు అప్పగిస్తుందో వేచి చూడాలి. తాజాగా కాంగ్రెస్ మేనిఫెస్టోను కూడా ఖర్గే శుక్రవారం విడుదల చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాములమ్మకు మళ్లీ ప్రచార బాధ్యతలు అప్పగిస్తుందో.. లేదంటే ఇంకెలా ఉపయోగించుకుంటుందో వేచి చూడాలి.భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసిన ఒక్క రోజునే మాజీ ఎంపీ విజయశాంతి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఎన్నికల మేనిఫెస్టో విడుదల కార్యక్రమం కోసం హైదరాబాద్ వచ్చిన మల్లిఖార్జున్ ఖర్గేను ఆయన బస చేసిన హోటల్ లో విజయశాంతి కలిశారు. అక్కడే పార్టీలో చేరిపోయారు. ఆమె రాహుల్ సమక్షంలో పార్టీలో చేరుతారని అనుకున్నారు. కానీ అధికారికంగా పార్టీ అధ్యక్షుడి సమక్షంలో చేరాలి కాబట్టి ఖర్గే తో కండువా కప్పించుకున్నారు. తర్వాత రాహుల్ గాంధీని కలిసే అవకాశం ఉంది. గతంలో కాంగ్రెస్ నుంచి విజయశాంతి బీజేపీలోకి వెళ్లారు. కానీ కొన్ని రాజకీయ కారణాల దృష్ట్యా విజయశాంతి బీజేపీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవల తెలంగాణకు వచ్చిన ప్రధాని మోడీ కార్యక్రమాల్లో కూడా ఆమె పాల్గొనలేదు. బుధవారం ఈమె బీజేపీకి రాజీనామా చేశారు. మొదట బీజేపీ నుంచే తన రాజకీయ జీవితం ప్రారంభించారు. తర్వాత తల్లి తెలంగాణ అనే సొంత పార్టీ పెట్టుకున్నారు.



## "గంగుల?. నీలెక్క నేను గుట్టలు మాయం చేశానా?

## భూకబ్జాలు చేశానా,పేదల ఇండ్లు కూల్చి సంపాదించానా?

### బీజేపీ నేత బండి సంజయ్

**కరీంనగర్,నవంబర్17 (మరో ఉదయం న్యూస్):**



మంత్రి గంగుల కమలాకర్‌పై బీజేపీ నేత బండి సంజయ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ "గంగుల?. నీలెక్క నేను గుట్టలు మాయం చేశానా? భూకబ్జాలు చేశానా? పేదల ఇండ్లు కూల్చి సంపాదించానా? తెలంగాణలో అత్యంత అవినీతిపరుడివి నువ్వే. కరప్షన్‌లో కరీంనగర్ టాప్ అని నిఘా నివేదికలే చెబుతున్న సోయి లేదా? నీకు బి.ఫాం ఇవ్వకుండా సతాయించింది నిజం కాదా. నేను అధికారంలోనే లేను? నిరంతరం పోరాటాలే చేసిన. నేను అవినీతికి ఎలా పాల్పడతా?... సోయిండే మాట్లాడుతున్నవా. బీజేపీ నన్ను గౌరవించింది. హెలికాప్టర్ ఇచ్చి రాష్ట్రమంతా ప్రచారం చేయిస్తోంది.. ఆ సంగతి నీకు తెల్వదా. అసలు నువ్వు? కరీంనగర్ ప్రజలకు ఒరగబెట్టిందేమిటి. రేషన్ కార్డు నీ చేతిలో పనే? ఎందుకివ్వలేదు. వడ్ల కొనుగోలు నీ శాఖదే? అక్రమాలు ఎందుకు ఆపలేదు" అంటూ గంగుల కమలాకర్‌ను బండి సంజయ్ విరుచుకుపడ్డారు.

### తెలంగాణ ప్రజల బాగుకోసమే

## ఆరు గ్యారంటీ పథకాలు

### శుక్రవారం 36 అంశాంలతో తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేసిన ఖర్గే

**హైదరాబాద్,నవంబర్17 (మరో ఉదయం న్యూస్):**



హైదరాబాద్: తెలంగాణ ప్రజల బాగు కోసమే కాంగ్రెస్ మేనిఫెస్టో అని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. శుక్రవారం 36 అంశాంలతో తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టోను ఖర్గే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కేసీఆర్ సర్కార్ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కొద్ది రోజులుగా కేసీఆర్‌కు భయం పట్టుకుందని.. ఆయన గొంతులో ఆందోళన కనిపిస్తున్నదని ఆయన తెలిపారు. మోదీ, కేసీఆర్ కలిసి ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని.. జనాలు ఇప్పటికే డిసైడ్ అయిపోయారని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ ఫార్మ్ హౌస్‌లోనే ఉండే కేసీఆర్ ఇక.. అక్కడే ఉండిపోతారని.. జనాలు బై బై కేసీఆర్.. టాటా కేసీఆర్ అంటారని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగుల బలిదానాలు చూసి సోనియా తెలంగాణ ఇచ్చారని తెలిపారు. జనాలు బాగు పడతారని తెలంగాణ ఇస్తే.. జనాలను దోచుకునే వాళ్లు రాజ్యమేలుతున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టులు, పథకాలు, ప్రతి దాంట్లోనూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలను ఇచ్చినట్టే.. ఇక్కడా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారు. కర్ణాటకలో చెప్పిన ప్రతి హామీనీ తాము నెరవేరుస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను బరాబర్ అమలు చేసి తీరుతామని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేబినెట్ ఏర్పాటైన తొలి రోజే వాటిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. "మా తొలి లక్ష్యం.. మహాలక్ష్మి పథకం.. ప్రతి నెలా రూ.2500, రూ.500కే గ్యాస్, బస్సుల్లో ఫ్రీ జర్నీ" అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# రాష్ట్రంలో భూ తగాదాలకు పరిష్కారం





### భూ రికార్డులను ఆధునీకరిస్తున్నాం

### భూహక్కులను అందచేసిన సిఎం జగన్

### చంద్రబాబు హయాంలో పట్టించుకోలేదని విమర్శలు

**నూజివీడు,నవంబర్17 (మరో ఉదయం న్యూస్):**

దశాబ్దాలుగా భూములపై అనుభవదారులుగా ఉన్న రైతులకు హక్కులు కల్పిస్తున్నామని నూజివీడులో ఏపీ సీఎం జగన్ పేర్కొన్నారు. 27లక్షల 42 వేల ఎకరాలకు సంబంధించి16 లక్షల 21వేల మందికి హక్కులు కల్పించబోతున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో అసైన్డ్ భూములను అత్తగారి సొత్తులా భావించి స్వాధీనం చేసుకునేవారన్నారు. చుక్కల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చంద్రబాబు చేర్చారని జగన్ పేర్కొన్నారు. పెత్తందార్లకు పేదలను పిలవడం నచ్చదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా భూ సర్వే చేస్తున్నామన్నారు.

## మలి విడత పోలింగ్ నేడు

### మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఎన్నికలకు సర్వం సిద్ధం

### మొత్తం 300 అసెంబ్లీ సెగ్మెంట్లకు ఓటింగ్..

**భోపాల్, రాయ్‌పుర్:**

మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 శాసనసభ స్థానాలకు, రెండోవిడత ఓటింగుకు సిద్ధమైన ఛత్తీస్‌గఢ్‌లో మిగిలిన 70 స్థానాలకు ఈరోజు పోలింగు జరగనుంది..

ఎస్పీ, బీఎస్పీ, ఆప్, జేడీయూ తదితర పార్టీలు బరిలో ఉన్నప్పటికీ.. రెండు రాష్ట్రాల్లో భాజపా, కాంగ్రెస్‌ల మధ్యే ప్రధాన పోటీ నెలకొని ఉంది. మధ్యప్రదేశ్‌లో ఎస్టీ రిజర్వుడు సీట్లు 47, ఎస్సీ రిజర్వుడు 35 ఉన్నాయి..







### ఎవడో మళ్లీ వస్తే ఆగం అవుతాం..

# ఆలోచించండి

## తెలంగాణ కోసం పదేళ్లుగా కష్టపడ్డా

### కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది

### పరకాల ప్రచారంలో సిఎం కెసిఆర్

**పరకాల,నవంబర్17 (మరో ఉదయం న్యూస్):**




తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ఈ పదేండ్లు ఎంతో కష్టపడ్డాం అని, తలసరి ఆదాయంలో రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలిచిందని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. మరి ఇప్పుడు ఎవడో వస్తే, వానికి ఓటు వేస్తే.. ఈ పదేండ్లు పడ్డ కష్టం బూడిదలో పోసిన పన్నీరు కావాల్నా..?ఆలోచించండని కేసీఆర్ సూచించారు. పరకాల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాదలో కేసీఆర్ పాల్గొని చల్లా ధర్మారెడ్డికి మద్దతుగా ప్రసంగించారు.తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిచేందుకు పది ఏండ్ల నుంచి మేం కష్టపడ్డాం.. తెలంగాణ రాష్ట్రం వచ్చిననాడు తలసరి ఆదాయంలో మన ర్యాంకు 19, 20 ఉండే. మేం పడ్డ కష్టానికి తలసరి ఆదాయంలో ఇవాళ ఇండియాలో తెలంగాణ నంబర్ వన్‌లో ఉంది. ఒకప్పుడు కరువుతో గొడగొడ ఏడ్సిన తెలంగాణ ఇది. భీవండికి బతుకపోయిన తెలంగాణ ఇది. కానీ అనేక మంచి కార్యక్రమాలు చేపట్టిన తర్వాత ఇవాళ 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తుంది. ఇంకా చిన్న చిన్న ప్రాజెక్టులు పూర్తయితే నాలుగు కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి, దేశానికే అన్నం పెట్టే తెలంగాణ తయారైతది. మరి మేం ఈ పదేండ్లు పడ్డ కష్టం బూడిదలో పోసిన సన్నీరు కావాల్నా..? ఇదే ప్రగతి కొనసాగాలంటే బీఆర్ఎస్సే ఉండాల్నా..? అనేది మీరు చర్చించి, నిర్ణయించాలి. అనేక సంక్షేమ కార్యక్రమాలు, మంచి పనులు బీఆర్ఎస్ చేసింది. ఇవన్నీ మీ కండ్ల ముందున్నాయి అని కేసీఆర్ తెలిపారు. తెలంగాణలో వ్యవసాయాన్ని నిలబెట్టాలని చెప్పి.. అనేక కార్యక్రమాలు అమలు చేశాం. రైతు బాగుంటేనే దేశం బాగుంటది.. గ్రామాలు మంచిగా అయితవని కఠినమైన నిర్ణయాలు తీసుకొని కొన్ని కార్యక్రమాలు అమలు చేసుకున్నాం.

మిగతా 2 లో

మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీల వ్యూహాలు

ఐదురాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ మొదటి వారంలోనే ముగియనున్నది. ఐదు రాష్ట్రాల్లోనూ నవంబర్ నెలాఖరు లోపే పోలింగ్‌ను ముగించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. బహుశా, డిసెంబర్‌లో ప్రారంభ మయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ఒక కీలకమైన ఎజెండాను మోదీ సర్కార్ నిర్ణయించు కుని ఉండవచ్చు. అంతకుముందే ప్రభుత్వ ఎజెండా ఏమిటన్నది ప్రజలు నిర్ణయించాలి. ప్రధానంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంగా బిజెపి ఎన్నికల వ్యూహంతో ముందుకు సాగే అవకాశం ఉంది. అయితే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా బిజెపి మేకపోతు గాంభీర్యంతో ముందుకు సాగడం ఖాయం. అయితే ఎన్నికల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎక్కడా ప్రతిఫలించడం లేదు. రైతుబంధు దుబారాను చర్చించడం లేదు. రూపాయికి కిలో బియ్యం ఇవ్వడమే దారుణమంటే.. ఇంకా సన్నబియ్యం ఇస్తామని ఆకట్టుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ కన్నా ఆసుపత్రులను అభివృద్ధి గురించి పట్టించు కోవడం లేదు. ఇలా తెలంగాణ సమస్యలే కాదు దేశ సమస్యలు అస్సలు చర్చకు రావడం లేదు. పార్లమెంటులో ప్రజల సమస్యలను చర్చించే ఆనవాయితీని మోడీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించలేదు. జిఎస్టీ ద్వారా వస్తున్న బాధలు పట్టించుకోవడం లేదు. ఎక్కడికక్కడ జిఎస్టీపై ఇకనుంచి చర్చ జరగాలి. జిఎస్టీతో జరుగుతున్న వాతలపైనా చర్చించాలి. వివిధ రంగాల ద్వారా ప్రజలపై ఎలా భారం పడుతుందో చర్చించాలి. విపక్షాలు కావచ్చు..ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు కూడా దీనిపై ప్రజల్లో చర్చ చేయాలి. అయితే ఇదే ఒక్కటే కాదు అనేక అంశాలపై ఈ ఎన్నికల ద్వారా చర్చించి.. రేపటి పార్లమెంట్ ఎన్నికల వరకు అన్ని అంశాలపై చర్చ జరిగేలా చేయాలి. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఎలావున్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టి ఇప్పటికే వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రక ఎన్నికలపైనే ఉన్నదని చెప్పక తప్పదు. ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం, నిర్వహణను ఆయన ఇప్పటికే మోదీ కేంద్రీకృత ఎన్నికలుగా మార్చారు. అందువల్ల ఆయా రాష్ట్రాల్లో కలుగుతున్న అనర్థాలను చర్చించాలి. ఎక్కడిక్కడ బిజెపి నేతలను నిలదీస్తూ వారి అభిప్రాయాలను కూడగట్టాలి. ఇలా ఎన్నికల్లో ప్రజల బాధలను ప్రభుత్వానికి ఎజెండాగా చేయాలి. ప్రస్తుత ప్రచార సరళిని సార్వత్రక ఎన్నికల వరకూ కొనసాగించాలి. కేంద్రం అనుస రిస్తున్న దుర్మార్గ నిర్ణయాల విషయంలో మోదీని ఢీకొనడంపై దృష్టి మరింతగా సారించాల్సి ఉంది. ఐదు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలకు ఒక వేళ విజయాలు లభించినా రాబోయే సార్వత్రక ఎన్నికల్లో ఆయా అంశాలపై వాటి వైఖరి ఏంటన్నది నిలదీయాలి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఈ అయిదు రాష్ట్రాల్లో ఓడిపోయింది. ఉత్తర భారతంలో హిందీ ప్రాంతాలైన మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం హస్తగతం చేసుకుంది. తెలంగా ణలో కేసీఆర్ రెండవసారి అధికారానికి వచ్చారు. మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్‌నే యథాప్రకారం విజయం వరించింది. 2018లో మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్‌లలో అంతకు ముందు 15 సంవత్సరాలుగా అధికారం లో ఉన్న బీజేపీని ఓడించినందుకు, రాజస్థాన్‌లో అధికారంలోకి వచ్చినందుకు కాంగ్రెస్ తనకు తిరుగులేదని భావించింది. కానీ మధ్యప్రదేశ్‌లో అధికారన్ని కాంగ్రెస్ నుంచి బిజెపి హస్తగతం చేసుకుంది. ఈ క్రమంలో మోడీ ఘన విజయాలపైన కాకుండా మోడీ వైఫల్యాలను ప్రజలు ఎజెండాగా చేసుకోవాలి. అప్పుడే మోడీ కళ్లు తెరిచి ప్రజలవైపు చూస్తారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై తప్పకుండా పడుతుంది. పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీకి, ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలను కత్తిమీద సాములా ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావాలి. ప్రజలు తము కట్టిన పన్నులతో అధికారంలో ఉన్న వారు సరదాలు తీర్చుకునే దుస్థితి పోవాలి. బీజేపీకి ఎప్పటిలా మోదీ ఆకర్షణ, జాతీయ వాదం, హిందుత్వ, డబుల్ ఇంజన్ సర్కార్‌తో పాటు ప్రతిపక్షాల అవినీతి, కుటుంబపాలనపై విరుచుకుపడడం ప్రధాన అస్త్రాలుగా ఉన్నాయి. తాజాగా మహిళా రిజర్వేషన్‌ను ఉపయోగించుకోవడానికి కూడా ప్రయత్నిస్తోంది. ప్రజలు చైతన్యం కాకుంటే పాలకులు ఎప్పుడూ స్వారీ చేస్తూనే ఉంటారు. ఈ క్రమంలో తాము కోల్పోయిన ఓబీసీ, దళిత, ఆదివాసీ, మైనారిటీ ఓటు బ్యాంకును తిరిగి పొందేందుకు కాంగ్రెస్ ఒక పథకం ప్రకారం ప్రయత్నిస్తోంది. కలుగణన అంశాన్ని ఆధారంగా అందలం ఎక్కాలని చూస్తోంది. బిహార్‌లో కులాల ఆధారంగా జరిగిన సర్వే ప్రకటించిన తర్వాత దేశంలో కాంగ్రెస్‌కు ఒక బలమైన సైద్ధాంతిక భూమిక లభించింది. మోదీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును మోదీ ఆమోదింపజేశాక,మహిళా ఓటు బ్యాంక్ దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతిపక్షాలు తమ వ్యూహాన్ని మరింత పటిష్ఠం చేసుకునే అవకాశాన్ని కులగణన ద్వారా పొందాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో దీనిని జాతీయ ఎజెండా చేయాలని ప్రయత్నిస్తున్నాయి. హిందూత్వ ప్రభావ పరిధిలోంచి ఆయా కులాలు బయట పడకుండే చూడాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ లక్ష్యంగా ఉంది. కులగణన ద్వారా హిందువులు విభజనకు గురికాకుండా ఐక్యం చేయాలన్నది మోడీ ఆలోచన. దానిని గండికొట్టి లబ్దిపొందాన్నది కాంగ్రెస్ ఎజెండా. అయితే కులాల అస్తిత్వాన్ని, వాటికి లభిస్తున్న అవకాశాలను ఒక చర్చనీయాంశంగా మార్చి తమకు అనుకూలంగా మార్పు చేసేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఒక రకంగా ప్రతిపక్షాల ఎజెండా బీజేపీ హిందూత్వ వాదానికి ఒక సవాల్ లాంటిదనే చెప్పలి. కాంగ్రెస్ విషయానికి వస్తే కర్ణాటక ఎన్నికల్లోనే సామాజిక న్యాయాన్ని తన అస్త్రంగా ఉపయోగించుకుంది. అదే అస్త్రాన్ని ఇప్పుడు జాతీయ స్థాయిలో ఉపయోగించుకునేందుకు వ్యూహరచన చేస్తోంది.

మొదటి పేజీ తరువాయి

## రాష్ట్రంలో భూ తగాదాలకు పరిష్కారం

రెండు విడతల సర్వే పూర్తయ్యిందని.. మూడో విడత ప్రారంభించబోతున్నామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూములపై దళిత రైతుల రుణాలు మాఫీ చేస్తూ, సర్వ హక్కులు కల్పించబోతున్నామని అన్నారు. లంక భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మూడు కేటగిరీలుగా పట్టాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని జగన్ వెల్లడించారు. రాష్ట్రంలో భూ తగాదాలకు పరిష్కారం చూపిస్తూ, రికార్డులు అప్ డేట్ చేస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో భూ యాజమాన్య హక్కుల పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,463.82 ఎకరాలను వ్యవసాయం కోసం కొత్తగా 42,307 మందికి డీకేటీ పట్టాలు పంపిణీ చేశారు. నిరుపేదలకు భూముల పంపిణీని ప్రారంభించడం సహా అసైన్డ్ భూములకు యావజమాన్య హక్కులు కల్పించడం, లంక భూములకు పట్టాలు సైతం అందజేశారు. చుక్కల భూములు, షరతుల గల పట్టా భూములు, సర్వీస్ ఈనాం భూములను 22 ఏ జావిబితా నుంచి తొలగించడం, భూ కొనుగోలు పథకం కింద ఇచ్చిన భూమివిలపై హక్కుల కల్పన, గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీని సీఎం చేపట్టారు. శ్మశాన వాటికలు లేని దళిత వాడల కోసం రాష్ట్రంలో 1,563 గ్రామాల్లో 951 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. సామాజిక న్యాయాన్ని ఓ విధానంలా అమలు చేస్తున్నామని సీఎం జగన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో భూతగాదాలు పరిష్కారమ య్యేలా వేల మంది సర్వేయర్లతో వేగంగా సర్వే చేయిస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. 'మొదటి దశలో 18 లక్షల ఎకరాల సర్వే పూర్తి చేశాం. రెండో దశలో 24.6 లక్షల ఎకరాల సర్వే పూర్తి చేశాం. మొత్తంగా 45 లక్షల ఎకరాల సరిహద్దు అంశాలు పరిష్కరించాం. 4 వేల గ్రామాల్లో రీసర్వే పూర్తైంది. ఆయా గ్రామాల్లో అక్కడి సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. గిరిజన రైతులకు పోడు భూములపై హక్కు కల్పించాం. లంక భూమి సాగు చేసుకుంటున్న రైతులకు హక్కు కల్పించాం. గ్రామ ఇనామ్ సర్వీస్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించామని వివరించారు. టీడీపీ హయాంలో అన్ని వర్గాలను మోసం చేశారని సీఎం జగన్ ధ్వజమెత్తారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అంతా దోపిడీయే జరిగిందని మండిపడ్డారు. ఆయన ప్రజలకు మంచి చేసి ఎప్పుడూ సీఎం కాలేదని, తొలిసారి వెన్నుపోటు తో, రెండోసారి కార్గిల్ యుద్ధం పుణ్యాన, మూడోసారి రుణమాఫీతో అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. సామాజిక వర్గాలపై చంద్రబాబు అభిప్రాయాన్ని ప్రజలంతా గుర్తుకు తెచ్చుకోవాలని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే ధైర్యం చంద్రబాబుకు లేదని ఎద్దేవా చేశారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని, ఈ సమయంలో తోడేళ్లంతా ఏకమవుతున్నాయని సీఎం జగన్ మండిపడ్డారు. దొంగల ముఠా అంతా ఏకమై, ప్రతి ఇంటికీ బెంజ్ కారు ఇస్తాం వంటి హామీలిస్తారని, వాటిని నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. 2014లో ఇచ్చిన హామీలు ఏవీ నెరవేరలేదని, చంద్రబాబుకు మేనిఫెస్టోపై కమిట్మెంట్ లేదని దుయ్య బట్టారు. అధికారంలోకి వచ్చాక 2 లక్షల 7 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ఇళ్ల పట్టాల లబ్ధిదారుల్లో 80 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకే ఇచ్చామని జగన్ వివరించారు. అభివృద్ధి, సంక్షేమం చూసి ప్రజలు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజా దీవెనలతో తాము ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని, ఎవరితోనూ పొత్తు ఉండదని స్పష్టం చేశారు.




## ఎవడో మళ్లీ వస్తే ఆగం అవుతాం..

మొదటి పేజీ తరువాయి

# ఆలోచించండి

పరకాలనవంబర్17 (మరో ఉదయం న్యూస్):

గతంలో ప్రాజెక్టు కింద నీళ్లు పారితే పన్నులు వసూళ్లు చేసేవారు. ఇవాళ నీటి తిరువా పన్ను లేదు. బకాయిలు రద్దు చేశాం. 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నాం. రైతుబంధు పథకాన్ని పుట్టించి, పెట్టుబడి అందిస్తున్నాం. అదృష్టం బాగాలేక రైతు చనిపోతే 5 లక్షలు బీమా ఇస్తున్నాం. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుంది. ఇవన్నీ మీ కండ్ల ముందు జరుగుతున్నాయి అని కేసీఆర్ తెలిపారు. కేసీఆర్‌కు పని లేదు.. రైతుబంధు ఇచ్చి డబ్బులు వేస్ట్ చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు అంటున్నరు. 10 వేల రైతుబంధును 16 వేలకు తీసుకుపోతాం. ఎప్పుడంటే చల్లా ధర్మారెడ్డి గెలిస్తే. అదే విధంగా 24 గంటల కరెంట్ అవసరం లేదని రేవంత్ అంటుండు. 3 గంటలు చాలు అంటుండు. పొలం ఎలా పారుతది అంటే 10 హెచ్‌పీ మోటార్ పెట్టుకోవాలని అంటుండు. దానికి సొమ్ము ఎవ్వడు ఇవ్వాలా..? నీ అయ్యా ఇవ్వాలా..? 30 లక్షల మోటార్లు ఎవరు మార్చాలా..? నోట్లకెళ్లి ఉట్టిగా మాట్లాడితే అయిపోతదా..? నెత్తా కత్తా.. ఏది పడితే అది మాట్లాడితే ఎట్ల.. ఇది వాళ్ల వైఖరి అని కేసీఆర్ తెలిపారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఉత్తమమైన మనిషి.. ప్రజల ఫీలింగ్ ఉన్న మనిషి అని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసించారు. ధర్మారెడ్డి ఉత్తమమైన మనిషి, ప్రజల ఫీలింగ్ ఉన్న మనిషి. ఆయన ఎవరి తెరుగు పోయేటోడు కాదు. నియోజకవర్గం పనే అడిగే వ్యక్తి. వ్యక్తిగత పనులు అడగలేదు. చలివాగు ప్రాజెక్టు కావొచ్చు, కాలువలు కావొచ్చు. దేవాదుల నీళ్ల విషయం కావొచ్చు. ఎస్సారెస్పీ నీళ్ల విషయం కావొచ్చు. ఇవే నాతో మాట్లాడిండు తప్ప వ్యక్తిగత పనులు అడగలేదు. ఇలాంటి మంచి అభ్యర్థిని గెలిపిస్తే రైతుబంధు 16 వేలు అయితది.. 24 గంటల కరెంట్ ఉంటది.. అన్ని విధాలా పరకాల అభివృద్ధి జరుగుతది. పరాకల అభివృద్ధి విషయంలో ఏం కావాలంటే అది చేసి పెట్టే బాధ్యత నాది. వేరోడు వస్తే మళ్లీ ఆగమాగం అవుతది. పాలిచ్చే బర్రెను అమ్ముకొని దున్నపోతును తెచ్చుకున్నట్లు అవుతది. లేనిది మెడకు తుండ కట్టుకున్నట్టు అవుతది. ఏది సమంజసం..? ఏది న్యాయం..? ఏ వైపు పోతే మంచిదని ఆలోచించాలి. మీ భవిష్యత్ మీ చేతుల్లో ఉంటది కాబట్టి నిర్ణయం చేస్తే మంచిది అని కేసీఆర్ సూచించారు. గతంలో తండాలను పంచాయతీలు చేసింర్రా..? ఎన్నేండ్లు కొట్లాడినా చేయలేదు. చివరకు బీఆర్ఎస్ తండాలను గ్రామ పంచాయతీలుగా చేసింది. మీరు మంచి వస్త్ర పరిశ్రమ తీసుకొచ్చారు.. కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్కు ఇక్కడకు రావడం చాలా సంతోషం. చాలా మంది మా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ధర్మారెడ్డి చెబుతుండ్రు. నిజంగా చాలా లాభం జరుగుతది. పరకాలకు ఏదో కోర్టు అడిషనల్‌గా అవసరం ఉంది. మీరు అనుకుంటే అయ్యే పని అంటున్నడు. అదే అయ్యే పని అయితే పరకాలలో పెట్టిస్తా తప్పకుండా. న్యాయవాద మిత్రులకు మనవి చేస్తున్నా. హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో మాట్లాడి కోర్టు తెప్పించే ప్రయత్నం చేస్తాను అని కేసీఆర్ హామీ ఇచ్చారు.





## కష్టాలు తీర్చిన నాయకుడిని మర్చిపోవద్దు

సిద్దిపేట,నవంబర్17 (మరో ఉదయం న్యూస్):

మర్కుక్ దశ, దిశ మార్చింది కేసీఆర్ నీళ్ల కష్టాలు తీర్చాడు. రోడ్లు లేక నాడు ఎంతో ఇబ్బందులు. నేడు డబుల్ రోడ్లు కనిపిస్తున్నాయి. గతుకుల గజ్వేల్(ఉజీతీలివశ్రీ)ను బతుకుల గజ్వేల్ చేసిండని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు గజ్వేల్ నియోజకవర్గం, మర్కుక్‌లో కేసీఆర్ గెలుపును కాంక్షిస్తూ మంత్రి హరీశ్ రావు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెత్తిమీద గంగమ్మ లెక్క కొండపోచమ్మ సాగర్ తెచ్చింది కేసీఆర్. ఎన్నికల సమయంలో ఎవడో వచ్చి బిడ్డా బిడ్డా అంటే నమ్మి మోసపోవద్దు. ఇంకొకడు వస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉండదు, అభివృద్ధి ఉండదని స్పష్టం చేశారు. నాడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన అంటే నేడు పోదాం పద సర్కారు దవాఖాన అంటున్నారు. ఈసారి బీఆర్ఎస్ గెలవగానే సన్నబియ్యం, పాత బియ్యం ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. అసైన్డ్ ల్యాండ్స్‌కి పట్టా ఇచ్చి హక్కులు ఇవ్వబోతున్నం. సిలిండర్ ధరలు పెంచిన బిజెపి వాళ్లని ప్రశ్నించాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదన్నారు. బూతులు మాట్లాడే వారికి పోలింగ్ బుతుల్లోనే బుద్ధి చెప్పాలని సూచించారు. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌ను మంచి మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంట్ వస్తది. 10 ఊఖ మోటార్ ఎవరు కొనివ్వాలి. రేవంత్ రెడ్డికి వ్యవసాయం అంటే తెల్వదని విమర్శించారు. 30 తేదీన అందరం కారుకు గుద్దాలి. బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మంత్రి హరీశ్ రావు సమక్షంలో పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



## పాకలపాటి అర్పిత కు కామర్స్ లో డాక్టరేట్

హైదరాబాద్: నవంబర్17 (మరో ఉదయం న్యూస్):



తోల్కట్ట ప్రాంతంలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల, వికారాబాద్ లో కామర్స్ లెక్చరర్ గా పనిచేస్తున్న పాకలపాటి అర్పిత పిహెచ్.డి పట్టా పొందారు.ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీచేసింది.ఖమ్మం జిల్లాకు చెందిన డా అర్పిత గత 2019 నుండి తోల్కట్ట సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల, వికారాబాద్ లో కామర్స్ లెక్చరర్ గా పనిచేస్తున్నారు. తన విద్వత్తుతో, బోధనా పటిమతో విద్యార్థుల, అధికారుల మన్ననలు చూరగొన్నారు. ఎంతోమంది విద్యార్థులు ప్రతిష్టాత్మక యూనివర్శిటీల్లో పి జి లో ప్రవేశం పొందడానికి కోచింగ్ ను సైతం ఇచ్చారు.ఆచార్య వి ఉషాకిరణ్ పర్యవేక్షణ లో ఇంపాక్ట్ ఆఫ్ వర్క్ లైఫ్ బ్యాలన్స్ ఆన్ జాబ్ సాటిస్ఫాక్షన్ అండ్ జాబ్ పర్ఫామెన్స్ - ఆన్ ఎవిడెన్స్ ఫ్రం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజెస్ అనే అంశం పై ఉస్మానియా యూనివర్శిటీ లో సిద్ధాంత గ్రంథం సమర్పించి పిహెచ్ డి పట్టా పొందారు.అద్భుతమైన అంశాన్ని ఎంచుకొని పిహెచ్ డి పట్టా పొందడం పట్ల సహ అధ్యాపకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు పిహెచ్ డి చేసే అవకాశం కలిపించిన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కు, రిజిస్ట్రార్ కు , గైడ్ ఆచార్య వి ఉషాకిరణ్ కు సిద్ధాంత గ్రంథం సమర్పించడంలో ప్రోత్సాహమందించిన భర్త వినయ్ కుమార్ కు కుటుంబ సభ్యులకు ,కాలేజీ ప్రిన్సిపాల్ డా కె శ్రీనివాస్ శర్మ కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

మార్పు కోసం ... మరో ఉదయం

# కోరుట్లలో గట్టి పోటీ ఇస్తున్న అర్వింద్

పసుపు బోర్డు కలసి వస్తుందన్న భరోసా

ముత్యంపేట ఫ్యాక్టరీని తెరిపిస్తానంటూ హామీలు

**జగిత్యాల,నవంబర్17(మరో ఉదయం న్యూస్):**

జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో గట్టి పోటీతప్పేలా లేదు. మూడు ప్రధాన పార్టీల నుంచి సీనియర్ నేతల వారసులు బరిలో ఉండడంతో పోటీ ఆసక్తి రేపుతోంది. అన్నింటికి మించి ఎంపి ధర్మపురి అర్వింద్ అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగడంతో ఆసక్తి పెరిగింది. ప్రధాని మోడీతో పసుపుబోర్డు ప్రకటించడంతో ఆయనలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. ఇక్కడ పసుపు రైతులు కూడా అధికంగా ఉండడం ఆయనకు కలసి వచ్చే అంశంగా చూడాలి. ధర్మపురి అర్వింద్ ఈసారి ఎమ్మెల్యేగా బీజేపీ నుంచి కోరుట్ల బరిలో నిలిచారు. ఇక్కడ బీజేపీ టికెట్ కోసం సీనియర్ నేత సురభి భూమ్ రావు కొడుకు నవీన్, డాక్టర్ జేఎన్ వెంకట్ పోటీపడ్డారు. కేంద్రం పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన చేయడంతో అర్వింద్ కోరుట్ల నియోజకవర్గాన్ని ఎంచుకొని రంగంలోకి దిగారు. ఎంపీగా గడిచిన నాలుగున్నరేండ్లలో చేసిన అభివృద్ధి, కేంద్రం నుంచి విడుదల చేయించిన నిధులు, పసుపు బోర్డు ఏర్పాటు లాంటి అంశాలపై ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కేంద్రాన్ని ఒప్పించి, రాష్ట్రానికి పసుపుబోర్డు తెచ్చానని చెప్పు కుంటున్నారు. ఈ పసుపు బోర్డే తనను గెలిపిస్తుందనే ఆశతో అర్వింద్ ఉన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని హామీ ఇస్తున్నారు. కొత్తగా ఫ్యాక్టరీల ఏర్పాటు చేయించి, స్థానిక యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తానంటున్నారు. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్రావు కొడుకు డాక్టర్ సంజయ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి దివంగత నేత జువ్వాడి రత్నాకర్ రావు కొడుకు నర్సింగరావు పోటీ చేస్తున్నారు. పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఓట్లుగా మలచుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానన్న హామీని కేసీఆర్ నిలబెట్టుకోలేకపోవడాన్ని ఈ ఇద్దరూ ఎత్తిచూపుతున్నారు. ఇటీవల పసుపు బోర్డు ఏర్పాటుపై కేంద్రం ప్రకటన చేయడంతో దానిని బీజేపీ అభ్యర్థి అర్వింద్ ప్రచారాస్త్రంగా మలుచుకున్నారు. జువ్వాడి రత్నాకర్ తనయుడు జువ్వాడి నర్సింగరావు గత ఎన్నికల్లో కోరుట్ల నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలో నిలిచారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నారు. తన తండ్రి రత్నాకర్ రావు మంత్రిగా ఉన్నప్పుడు నియోజక వర్గంలో చేసిన అభివృద్ధిని గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టించిన ఇందిరమ్మ ఇండ్లు, తీసుకొచ్చిన వెటర్నరీ కాలేజీ, డిగ్రీ కాలేజీ గురించి పదేపదే ప్రస్తావిస్తున్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ రీ ఓపెనింగ్ కోసం



రైతుల పక్షాన చేసిన పోరాటం నర్సింగరావుకు కలిసి వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. కోరుట్లలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటనతో పాటు, పాదయాత్రలో ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీని రీఓపెన్ చేయిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటన ఓట్లు తెచ్చి పెడుతాయని చెబున్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క, ఆమె కొడుకు కరంచంద్‌తో పాటు, సీనియర్ నేతలు కల్వకుంట్ల సుజిత్ రావు, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి కోరుట్ల కాంగ్రెస్‌టికెట్?ఆశించి భంగపడ్డారు. వీరంతా నర్సింగరావుకు ఏమేరకు సహకరిస్తారనే దానిపై కాంగ్రెస్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. దీంతో అసంతృప్త నేతలందరినీ పిలిపించుకున్న పార్టీ పెద్దలు, నర్సింగరావు గెలుపు కోసం పనిచేయాలని, అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పిస్తామని బుజ్జగిస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత ఎమ్మెల్యే, తండ్రి విద్యాసాగర్ రావుతో కలిసి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ కొంత కాలంగా కోరుట్ల బీఆర్ఎస్‌లో యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. ఫ్రీ హెల్త్ క్యాంపులు పెట్టడంతోపాటు ఉద్యోగ మేళాలు పెట్టి గుర్తింపు పొందారు. స్థానికంగా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తూ డిస్కౌంట్ల డాక్టర్‌గా పేరు ఉంది. వీటితోపాటు ఎమ్మెల్యేగా తండ్రి చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు తనని గెలిపిస్తాయని సంజయ్ భావిస్తున్నారు. షుగర్ ఫ్యాక్టరీ రీఓపెన్ చేయించకపోవడం బీఆర్ఎస్‌కు మైనస్‌గా కనిపిస్తోంది. రైతులతో పాటు, మైనార్టీల ఓట్లు ఎక్కువగా చీలిపోయే అవకాశం ఉందనే చర్చ జరుగుతున్నది.

## బొందల గడ్డ కరీంనగర్‌ను సీఎం అద్భుతంగా తీర్చిదిద్దారు : గంగుల

**హైదరాబాద్,నవంబర్17(మరో ఉదయం న్యూస్) :**

కరీంనగర్ : బొందల గడ్డగా ఉన్న కరీంనగర్‌ను సీఎం కేసీఆర్(అఓ అఖీ) కోట్లాది రూపాయలు వెచ్చించి గొప్పగా అభివృద్ధి చేశారని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్(ఓతినితిబబివతీ ఉజీనిణబీశ్రీజీ )అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు కరీంనగర్ ఎట్లా ఉందో ఇప్పుడు ఇలా ఉందో చూడాలి. కేసీఆర్ లేని తెలంగాణ ఊహించలేం. కాంగ్రెస్ దరిద్ర పాలనలో అన్ని విధాలా మోసపోయామన్నారు. సమైక్య పాలనలో ఆడబిడ్డలు నీళ్లకోసం అరిగోసపడ్డారన్నారు. మానేరు డ్యాం ఎండిపోతే బోరింగు కొట్టి కొట్టి జబ్బలు నొచ్చినా కానీ బిందె నిండకపోయేది. సీఎం కేసీఆర్ వచ్చాక నీటి కొరత తీరిందన్నారు. మండుటెండల్లో సైతం చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయని చెప్పారు. తెలంగాణ వ్యతిరేక శక్తులు ఏకమయ్యాయి. సీఎం కేసీఆర్ మరోసారి సమర శంఖం పూరించాలన్నారు. దొంగల చేతిలో తెలంగాణను పెట్టొద్దన్నారు. కరీంనగర్‌లో అన్ని స్థానాల్లోనూ బీఆర్ఎస్‌ను గెలిపిస్తామన్నారు.



## కాంగ్రెస్ హామీలు ప్రజలు ఎవరూ నమ్మే స్థితిలో లేరు

### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్,నవంబర్17(మరో ఉదయం న్యూస్):**

ఆరు గ్యారెంటల పేరుతో తప్పుడు కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తున్నదని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫైర్ అయ్యారు. సనత్ నగర్‌లోని సుభాష్ నగర్, సాయిబాబా నగర్, జై ప్రకాష్ నగర్, కైలాష్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులకే గ్యారెంటీ లేదు. అలాంటి రాష్ట్రానికి ఏం చేస్తుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలు తిరిగి ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారు. ఖచ్చితంగా మూడోసారి తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.




# అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ పోరు


ఆస్ట్రేలియాతో పోటీకి టీమిండియా సిద్ధం

సమిష్టిగా రాణిస్తేనే ఆసిస్‌ను మట్టి కరిపించగలం

**న్యూఢిల్లీ,నవంబర్17(మరో ఉదయం న్యూస్):**




క్రికెట్‌లో ఎప్పుడు ఎలాంటి అనూహ్య పరిణామాలు జరుగుతాయో చెప్పలేం. ఈ ప్రపంచ కప్‌లో అదే జరిగింది. ముందు నుంచి దూకుడుతో నెగ్గుతూ వచ్చిన సౌతాఫ్రికా పోటీ నుంచి నిష్క్రమించింది. మొత్తంగా ప్రపంచ కప్ ఇప్పుడు చివరి అంకానికి చేరింది. వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా దక్షణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన ఆస్ట్రేలియా జట్టే.. మన ఫైనల్ ప్రత్యర్థి. ఆదివారం 19న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా టైటిల్ కోసం ఈ ఇరు జట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం మన జట్టు ఫామ్, సాధిస్తున్న విజయాలను బట్టి ఆసీస్‌ను ఓడించడం పెద్ద కష్టం కాకపోయినా.. గెలుపు కోసం శ్రమించాల్సి రావొచ్చు. కంగారూలు అంత తేలిగ్గా ఓటమిని అంగీకరించరు. ఈ టోర్నీలో రోహిత్ సేన ఓటమి ఎరుగని జట్టుగా వరుస విజయాలతో జోరు మీదుంటే.. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటమి మినహా కంగారూలు అలానే కనిపిస్తున్నారు. దీంతో మ్యాచ్ హోరీహోరీగా సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. లీగ్ దశలో 9 మ్యాచ్‌ల్లో విజయం సాధించిన భారత జట్టు.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఆపై నాకౌట్ పోరులో నాలుగో స్థానంలో ఉన్న న్యూజిలాండ్‌ను మట్టి కరిపించి ఫైనల్‌లో అడుగుపెట్టింది. మరోవైపు, మెగా టోర్నీ ఆరంభంలో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఆసీస్ సెమీస్ చేరేది కష్టమే అనిపించినా.. ఆ తరువాత అనూహ్యంగా పుంజుకొని వరుస విజయాలు సాధించింది. అఫ్ఘనిస్తాన్‌పై చచ్చీ చెడీ గెలిచి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఆపై నాకౌట్ పోరులో పటిష్ట సౌతాఫ్రికాను చిత్తుచిత్తుగా ఓడించి ఫైనల్‌లో అడుగుపెట్టింది. ఇలా ఇరు జట్ల ప్రయాణంలో చాలా తేడా ఉన్నప్పటికీ.. ఆస్ట్రేలియాను ఏమాత్రం తక్కువ అంచనా వేయలేం. గతంలో వన్డే ప్రపంచ కప్ చరిత్రలో 7 సార్లు ఫైనల్ చేరిన ఆసీస్ జట్టు.. ఐదు సార్లు విశ్వవిజేతగా నిలిచారంటే వారు ఎలా ఆడతారో ఊహించగలం. ఆదిలోనే వారిని దెబ్బ కొట్టాలి. మొదట బ్యాటింగ్ అయితే, న్యూజిలాండ్‌పై ఎలా దూకుడుగా ఆడామో అదే శైలి వీరిపై కూడా అనుసరించాలి. అదే మొదట బౌలింగ్ అయితే వీలైనంత త్వరగా వార్నర్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్‌లను పెవిలియన్ చేర్చాలి. అప్పుడే మ్యాచ్‌పై పట్టు సాధించగలం. ఇకపోతే ఈ వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ కెప్టెన్‌గా జట్టును నడిపిస్తున్న తీరు అద్భుతం. ధనాధన్ బ్యాటింగ్‌తో జట్టుకు మెరుపు ఆరంభం ఇస్తున్నాడు. ఈ క్రమంలో అతడు వ్యక్తిగత మైలురాళ్ల కోసం ఏమాత్రం చూసుకోవడం లేదు. అలా మైలురాళ్లకోసం చూసుకొనివుంటే ఈసారి మెగా టోర్నీలో రోహిత్ ఎంత లేదన్నా ఐదు శతకాలు తన ఖాతాలో వేసుకొనేవాడు. కానీ తన ఆట తీరుతో కోట్లాది మంది హృదయాలను అతడు గెలుచుకున్నాడు. అమోఘ సారథ్యంతో జట్టును ఫైనల్‌కు చేర్చిన హిట్‌మ్యాన్‌కు..19న జరిగే తుది పోరునాటికి 36 సంవత్సరాల 203 రోజులు నిండుతాయి. తదుపరి ప్రపంచ కప్ నాటికి అతడికి 40 ఏళ్లు దాటతాయి. అంటే..వచ్చే వన్డే వరల్డ్ కప్ ఆడే అవకాశాలు రోహిత్‌కు దాదాపు లేనట్టే. ఈనేపథ్యంలో ఈసారి ప్రతిష్మాత్మక కప్ అందుకొని అటు క్రికెటర్‌గా, ఇటు సారథిగా తన కెరీర్‌ను చిరస్మరణీయం చేసుకొనేందుకు రోహిత్‌కు ఇంతకుమించిన తరుణం ఉండబోదు. రాబోయే రెండు నెలల్లో ఈ జట్టుతో కలిసి నేను ఎన్నో మధురానుభూతులు పంచుకోవాలను కుంటున్నానని ఆసియా కప్ వన్డే టోర్నీకి ముందు రోహిత్ చెప్పాడు. అందుకనుగుణంగానే.. లీగ్ దశ తొమ్మిది




మ్యాచ్‌లతోపాటు సెమీఫైనల్లో సాధించిన విజయంతో ఆ మధురానుభూతులను ఆస్వాదిస్తున్నాడు. కెప్టెన్‌గా జట్టుకు శుభారంభాలు ఇస్తూ..దానిని ఇతరులు కొనసాగించేలా మార్గదర్శనం చేస్తున్నాడు. ప్రతిభ కలిగిన ఆటగాడికి అండగా నిలవడంలో రోహిత్ ఎంతో ముందుంటాడు. న్యూజిలాండ్‌పై సెమ్గీ÷నైల్లో విజయం అనంతరం రోహిత్ గాల్లోకి ఎగిరి గెంతిన దృశ్యం ఆసియా కప్ అనంతరం అతడు చెప్పిన 'మధురానుభూతి'లో ఒకటి. అది పరిపూర్ణం కావాలంటే జట్టు సహచరులంతా ఇదే అద్భుత, సమష్టి ప్రదర్శనతో ఫైనల్లో గెలిచి వరల్డ్ కప్ సాధించడంలో దోహదపడాలి.

# తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

## మొత్తం 37 అంశాలతో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

**హైదరాబాద్,నవంబర్17 (మరో ఉదయం న్యూస్) :**

తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదలైంది. శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మేనిఫెస్టోను విడుదల చేశారు. మొత్తం 37 అంశాలతో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదలైంది. తమ మేనిఫెస్టో తెలంగాణ ప్రజలకు అంకితమని ఖర్గే స్పష్టం చేశారు. సర్వమతాలకు కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ పత్రమని.. హిందువులకు భగవత్ గీత , ముస్లింలకు ఖురాన్, క్రిస్టియన్‌లకు బైబిల్ తమ మేనిఫెస్టో అని ఏఐసీసీ చీఫ్ వెల్లడించారు. దాదాపు 42 పేజీలతో కాంగ్రెస్ మేనిఫెస్టోను రిలీజ్ చేసింది. అలాగే జాబ్ క్యాలెండర్‌ను కూడా హస్తం పార్టీ విడుదల చేసింది. గ్రూప్ -1 ఉద్యోగాల భర్తీ డేట్‌ను కూడా ప్రకటించింది. ఫిబ్రబర్ 1, 2024లో ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.

### కాంగ్రెస్ మేనిఫెస్టో ఇదే..

-నిరుద్యోగ నిర్మూలన ఉద్యోగం కల్పించే వరకు రూ.4 వేల నిరుద్యోగ భృతి

-మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

-మొదటి ఏడాదిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ

-18 సంవత్సరాల పైబడి చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లు

-ఎస్సీ రిజర్వేషన్ల పెంపు

-ఏబీసీడీ వర్గీకరణ

-బెల్ట్ షాపులు రద్దు

-తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఎంటి స్థలం, గౌరవ భృతి

-వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్.

-3 లక్షల వడ్డీ లేని పంట రుణం.

-కోతుల నివారణకు ప్రతీ జిల్లాలో స్టెరిలైజ్ కేంద్రం.

-కాళేశ్వరం అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ.

-చెరువుల నిర్వాహణ, మరమ్మతుల బాధ్యత నీటి సంఘాలకు అప్పగింత.

-తొలి క్యాబినెట్‌లో మెగా డీఎస్సీ

-రూరల్ యూత్ ఫైనాన్స్ కార్పోరేషన్‌కు రూ.1000 కోట్ల బడ్జెట్.

-విద్యార్థులకు ఫ్రీ ఇంటర్ నెట్.

-విద్యా రంగానికి బడ్జెట్‌లో 6 నుంచి 15 శాతం వరకు పెంపు.

-ఖమ్మం, ఆదిలాబాద్‌లలో నూతన విశ్వవిద్యాలయాలు.

-వైద్య రంగం బడ్జెట్ రెట్టింపు.

-ధరణి స్థానంలో భూమాత పోర్టల్.

-రేషన్ ద్వారా సన్న బియ్యం , రేషన్ డీలర్‌లకు రూ.5 వేల గౌరవ భృతి.

-కొత్త రేషన్ కార్డులు.

-200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు.

-ఆర్టీసీని ప్రభుత్వంలో వీలీన ప్రక్రియ పూర్తి చేస్తాం.

-ప్రతీ ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం.

-కళ్యాణమస్తు కింద లక్ష రూపాయలతో పాటు 10 గ్రాముల బంగారం.

-మహిళా సంఘాలకు పావులా వడ్డీ రుణాలు.

-జూనియర్ న్యాయవాదులకు మొదటి 5 సంవత్సరాలు నెలకు రూ.5 వేల గౌరవ భృతి.

-100 కోట్లతో జర్నలిస్ట్‌ల సంక్షేమ నిధి.

-హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో జర్నలిస్టుల ఇళ్ళ సమస్యకు పరిష్కారం.

-ఎన్నారైల సంక్షేమ బోర్డ్ .

-దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్.

-దేవాలయాలకు దూప దీప నైవేద్యం కింద నెలకు రూ.12 వేలు

# మటన్ షాపులో మటన్ కొట్టి ఓట్లు అభ్యర్థించిన చైర్పర్సన్

## ఆరవ వార్డు కాపు కృష్ణ సీతాలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

**కొత్తగూడెం నవంబర్17 (మరో ఉదయం న్యూస్) :**

మున్సిపాలిటీ 6 వ వార్డు లో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి టీబీజీకేస్ 11 మెన్ కమిటీ సభ్యులు కాపు కృష్ణ ఆధ్వర్యంలో కొత్తగూడెం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం విస్తృతంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి గడపగడపకు తిరుగుతూ వనమా చేసిన అభివృద్ధిని వివరిస్తూ తిరిగి వనమనే మళ్లీ గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న చైర్ పర్సన్ దంపతులు. ఈ సందర్భంగా మటన్ షాప్ లో మటన్ కొట్టి ఓట్లను అభ్యర్థించిన కొత్తగూడెం పట్టణ ప్రథమ పౌరురాలు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం ను ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు ఎంతో కృషితో వార్డులను ఎంతగానో అభివృద్ధి చేశారని ప్రతి లైన్ కి సిసి రోడ్లు డ్రైనేజీలు నిర్మించడం జరిగిందని కంటి ముందే అభివృద్ధి కనిపిస్తుందని ఇంటి ముందు ఉండే అభ్యర్థిని గెలిపించాలని వారు కోరారు కొత్తగూడెం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం కొరకు మూడువేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆరో వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పార్కులు పార్కులు జిమ్ములు తో పట్టణం అభివృద్ధి చెందుతుందని వారన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా చరిత్రను సృష్టిస్తారని వనమా వెంకటేశ్వర్ రావు గెలిచి అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తారని వారు అన్నారు. కొత్తగూడెం కొత్తగూడెం పట్టణం సుందరీకరణలో భాగంగా మూడువేల కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి చెందుతుందని దాన్లో భాగంగానే రామవరం ఎంతగానో అభివృద్ధి చెందిందని ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి వనమా వెంకటేశ్వర అని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆరో వార్డులో మెజార్టీ ఎక్కువ వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని వనమా వెంకటేశ్వరరావు గెలుపుకి కృషి చేయాలని వారు అన్నారు . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇంటింటి ప్రచారంలో పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమాలు మైనార్టీ నాయకులు కాజా వార్డు పెద్దలు మహిళలు ప్రజలు పాల్గొన్నారు









# కొత్త వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు ఆర్య

వైవిధ్యభరితమైన సినిమాలు చేస్తూ? తనకంటూ సౌత్ ఇండస్ట్రీలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు కోలీవుడ్ స్టార్ హీరో ఆర్య . ఇక ఆర్య నటించిన తమిళ సినిమాలు తెలుగులో కూడా డబ్ అయ్యి మంచి విజయం సాధించాయి. అయితే ఆర్య ఓ కొత్త వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా వెబ్‌సిరీస్ 'ది విలేజ్'. మిలింద్ రాజు దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో ఈ వెబ్ సిరీస్ విడుదల కానుంది. ఇప్పటికే ఈ సిరీస్ నుంచి వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్‌లు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సిరిస్ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ఆర్య తన ఫ్యామిలీతో కలిసి రోడ్ ట్రిప్ కి వెళుతుండగా వారి వాహనం పాడవ్వడంతో ట్రైలర్ మొదలవుతుంది. ఇక ట్రైలర్ గమనిస్తే.. తన ఫ్యామిలీతో కలిసి ఆర్య ఒక భయంకరమైన గ్రామంలో చిక్కుకుంటాడు. అయితే అక్కడున్న వింత మనుషుల నుంచి తన ఫ్యామిలీని రక్షించుకునేందుకు ఆర్య ఎలాంటి సాహసాలు చేస్తాడు అనేది సిరీస్ స్టోరీ. ఇక తొలిసారి గ్రాఫిక్ నవల ఆధారంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సిరీస్ తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నవంబరు 24న స్ట్రీమింగ్ కానుంది.

# సంక్రాంతికి వెంకటేశ్ అభిమానులకు డబుల్ పండుగ

జనవరి 13న సైంధవ్ తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషలో వస్తున్న సైంధవ్ టాలీవుడ్ హీరో వెంకటేశ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న చిత్రం సైంధవ్. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వెంకటేశ్ 75వ సినిమాగా వస్తోన్న ఈ చిత్రానికి హిట్ ఫేం శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నాడు. 2024 సంక్రాంతి కానుకగా జనవరి 13నతెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇదిలా ఉంటే తాజాగా సైంధవ్ ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ అందించారు. ట్రాక్‌ను నవంబర్ 21న లాంఛ్ చేయనున్నట్టు ప్రకటించారు. సైంధవ్ ఫస్ట్ సింగిల్ త్వరలోనే అంటూ వెంకీ అండ్ టీం చిల్ అవుట్ మూడ్‌లో ఉన్న లుక్‌ను విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. చంద్రప్రస్థ ఫిక్షనల్ పోర్ట్ ఏరియా బ్యాక్‌డ్రాప్‌లో సాగే మిషన్ నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో జెర్సీ ఫేం శ్రద్దా శ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంతో బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీ టాలీవుడ్‌కు పరిచయమవుతున్నాడు. ఇప్పటికే మేకర్స్ సైంధవ్ పాత్రలను పరిచయం చేస్తూ లాంఛ్ చేసిన వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. సైంధవ్‌లో శ్రద్దా శ్రీనాథ్ మనోజ్ఞగా, రుహానీ శర్మ డాక్టర్‌గా, నవాజుద్దీన్ సిద్దిఖీ వికాస్ మాలిక్ పాత్రలో, కోలీవుడ్ యాక్టర్ ఆర్య మానస్ పాత్రలో కనిపించనున్నారు. సైంధవ్ గ్లింప్స్ వీడియో సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తోంది. సైంధవ్ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి తెరకెక్కిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నాడు.



# అది నా చిన్నప్పటి కల : శ్రీలీల



టాలీవుడ్‌లో వరుస చిత్రాలతో దూసుకెళ్తుంది శ్రీలీల. ఓ పక్క టాప్ హీరోలతో సినిమాలు చేస్తూనే ఎంబీబీఎస్ కూడా చదువుతోంది. గత నెల 'భగవంత కేసరి' చిత్రంలో విజ్జి పాపగా అలరించిన శ్రీలీల ఈ నెల 'ఆదికేశవ' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు చెప్పింది. ఎంబీబీఎస్ చదవడం గురించి తెలిపింది. "డాక్టర్ కావాలన్నది చిన్నప్పటి కల. డాక్టర్ అవుతానని ఇంట్లో వాళ్లకు మాటిచ్చా. ఆ మాట నిలబెట్టుకుంటా. నటిగా ఉంటూనే ఎంబీబీఎస్ పూర్తి చేసేందుకు రెడీ అవుతున్నా. నటిగా ప్రేక్షకులను అలరించటాన్ని, వేలమంది అభిమానుల అభిమానాన్ని పొందటాన్ని అదృష్టంగా భావిస్తున్నా. దాంతోపాటు డాక్టర్ కావడం అనేది నా తొలి ప్రాధాన్యం. అయితే నా ఒపీనియన్ ప్రకారం.. ప్రతి అమ్మాయికీ వృత్తిపరంగా అలాంటి బ్యాకప్ తప్పక ఉండాలి. నటిగా నా అభినయంతో.. లేదంటే వైద్యురాలిగా చికిత్స అందించడం ద్వారా ప్రజల స్వాంతన ఇవ్వాలనుకుంటున్నా" అని తెలిపారు. ప్రస్తుతం 'ఆదికేశవ', 'గుంటూరు కారం', 'ఉస్తాద్ భగతసింగ్', 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్' సినిమాల్లో నటిస్తున్నారు. వైష్ణవ్ తేజ్ హీరోగా నటించిన 'ఆదికేశవ' నవంబర్ 24న విడుదల కానుంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రానికి శ్రీకాంత్ ఎన్.రెడ్డి దర్శకుడు.




# ప్రపంచ కప్ మనదే పక్కా రజనీకాంత్

ఐసీసీ వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. ఆదివారం (నవంబర్ 19) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్ ? ఆస్ట్రేలియా మధ్య ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఫైనల్స్ కావడంతో క్రికెట్ అభిమానులే కాదు.. అన్ని రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ మ్యాచ్‌కు స్వయంగా హాజరై వీక్షించే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఫైనల్స్‌పై తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ వంత శాతం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం భారత్ ? న్యూజిలాండ్ మధ్య జరిగిన సెమీఫైన్సల్ మ్యాచ్‌ను రజనీకాంత్ వాంఖడే స్టేడియంలో స్వయంగా కుటుంబ సమేతంగా వీక్షించిన విషయం తెలిసిందే. అనంతరం చెన్నై చేరుకున్న సూపర్ స్టార్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఫైనల్స్‌లో భారత్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 'న్యూజిలాండ్‌తో జరిగిన సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో మొదట కాసేపు టెన్షన్ పడ్డాం. మొదటి గంటన్నర చాలా ఆందోళనకు గురయ్యాం. ఆ తర్వాత వరుసగా వికెట్లు పడిపోవడంతో గేమ్ మనకు అనుకూలంగా మారింది. ఈ సారి ప్రపంచకప్ మనదే. ఫైనల్స్‌లో వంద శాతం ఖచ్చితంగా భారత్ గెలుస్తుంది' అని ధీమాగా చెప్పారు.

# నిజంగా నువ్వు ఎంతో గొప్పవాడివి : అనుష్క శర్మ

ఏ రంగంలోనైనా మన అనుకున్న వారికి సక్సెస్ వస్తే.. అందులో కలిగే ఆనందమే వేరు. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఎగిరి గంతులేస్తాం. ప్రపంచాన్ని మర్చిపోయి, ఆ మధురానుభూతిని ఆస్వాదిస్తాం. ముంబై వేదికగా బుధవారం జరిగిన క్రికెట్ ప్రపంచకప్ సెమీ ఫైనల్‌లో విరాట్ కోహ్లీ బ్యాట్‌తో శివతాండవం ఆడుతుంటే.. చూసి ఎంజాయ్ చేయడం అనుష్క శర్మ వంతైంది. ప్రపంచకప్ అనే కాదు.. గ్రౌండ్, మ్యాచ్ ఏదైనా సరే.. ఆ మ్యాచ్‌కి ఆమె హాజరై ఉంటే.. క్రీజులో కోహ్లీ పరుగుల వర్షం కురిపించినప్పుడల్లా.. అనుష్క శర్మ కూడా అలాగే ఎంజాయ్ చేస్తుంటుంది. అతడు బంతిని బౌండరీకి పంపిస్తే చాలు.. ఆమె నుంచి వెంటనే రియాక్షన్ వచ్చేస్తుంది.






# మొదటి పది నిమిషాలు ఫ్రీ

యానిమల్ సినిమాను డిసెంబర్ 1న పాన్ ఇండియా లెవల్లో హిందీ, తెలుగు, తమిళ,మళయాళం భాషల్లోనూ విడుదల చేయనున్నారు. ఈక్రమంలో ఇప్పటికే విడుదలైన పాటలు, ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్‌కు గురి చేయగా అవి ఓ అంచనా వేయలేకుండా సినిమాలో సమ్‌థింగ్ ఉందనేలా ఉండడంతో సినీ అభిమానుల్లో క్యూరియాసిటీని మరింత పెంచాయి. అయితే సినిమా విడుదలకు ఇంకా 25 రోజుల సమయం ఉన్నప్పటికీ అప్పుడే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలై టికెట్స్‌కు డిమాండ్ పెరిగింది. ఇటీవలే తెలుగులో ఫేమస్ షో అయిన బాలకృష్ణ అన్ స్టాపబుల్‌లో పాల్గొని సినిమా ప్రమోషన్స్ కూడా చేశారు. ఇదిలాఉండగా ఇప్పుడు ఈ యానిమల్ సినిమా విషయంలో రెండు కీలక అప్డేట్స్ సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. థియేటర్లలో రిలీజ్‌కు ముందే సినిమాలోని మొదటి పది నిమిషాలను విడుదల చేయాలని ఆ చిత్ర యూనిట్ ఆలోచిస్తున్నదని వార్తలువస్తున్నాయి. అయితే గతంలో బాహుబలి వంటి ఒకటి రెండు సినిమాలు కూడా తమ చిత్రంలోని మొదటి పది నిమిషాలను సినిమా విడుదలకు ముందే అన్‌లైన్‌లో విడుదల చేశారు. ఇప్పుడు అదే ఫార్ములాను ఈ యానిమల్ చిత్ర బృందం చేస్తున్నదని సమాచారం. ఇక సినిమా నిడివి విషయంలోనూ కొన్ని వార్తలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. సినిమా నిడివి 200 నిమిషాలు ఉంటుందని అంటే దాదాపు 3గంటల 20నిమిషాలు ఉండనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తలన్నింటిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ఇక ఈ సినిమాలో అనీల్ కపూర్, బాబీడియోల్ వంటి స్టార్స్ నటిస్తున్నారు. ఈ సినిమా అనంతరం సందీప్ రెడ్డి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో ఓ సినిమా చేయనున్నాడు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com